సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లాలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. -8లో



కలియుగ దైవంతో రాజకీయం చేస్తే పుట్టగతులుండవు

దేవదేవుడితో కూడా రాజకీయాలు చేస్తే పుట్టగతులుండవని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.460
రెండోరకం	రూ.340	రూ.416

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 142 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంవో వేణుగోపాల్

వాల్మీకిపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని నాయనవారిపల్లిలో నిర్వహిస్తున్న లార్వా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉంచుకున్న డ్రమ్ములు, బకెట్లను పరిశీలించి లార్వాలను గుర్తించారు. ప్రజలకు లార్వా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైడేగా పాటించాలని సూచించారు. అనంతరం చింతపర్తిలో ఉన్న బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను సందర్శించారు. కిటికీలకు రంధ్రాలు లేకుండా మెష్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సనా ఆయేషా, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ముజీబ్, సూపర్‌వైజర్ సుధాకర్, హాస్టల్ వార్డెన్ రవీంద్ర, ఎఎన్‌ఎం హృదయేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


పశువైద్య కళాశాలలో ప్రవేశాలు

ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో గురువారం 2024–25 సంవత్సరానికి మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. 28వ తేదీ వరకు ప్రవేశాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా మొత్తం 60 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామన్నారు. వీరిలో 15 మంది వీసీఐ కోటా ద్వారా ప్రవేశం పొందారన్నారు. ఈనెల 28న ఓరియంటేషన్ క్లాసులు నిర్వహిస్తామని, 30వ తేదీ నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు క్లాసులు ప్రారంభమవుతాయని తెలిపారు.

పలువురు సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కడప జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లను అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు.. జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న లక్ష్మీదేవిని తిరుపతి అర్బన్‌కు బదిలీ చేశారు. సిద్దవటం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రాజా చంద్ర మౌళిని నంద్యాల జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. కడప జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా బి.హరికృష్ణ, రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.నజీర్, సిద్దవటంకు శ్రీనివాసమూర్తి, పులివెందుల చంద్రమోహన్, ముద్దనూరు జీవీ రత్నమ్మ, బద్వేలుకు విద్యాసాగర్‌రెడ్డి, మైదుకూరుకు దూదేకుల మహబూబ్‌బాష, జమ్మలమడుగుకు మహమ్మద్ అజీబుల్లా, కమలాపురానికి డి.మహబూబ్‌బాషా, ప్రొద్దుటూరు జాయింట్–1కు జీఎస్‌జే రామదాసు, ప్రొద్దుటూరు జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్‌గా బి.పార్వతిలను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కడప జాయింట్–1, వేంపల్లె సబ్ రిజిస్ట్రార్లుగా ఎవరినీ నియమించకపోవడం గమనార్హం.

హార్సిలీహిల్స్‌కు అవార్డు



హార్సిలీహిల్స్‌లోని వ్యూ పాయింట్

రాయచోటి: హార్సిలీహిల్స్ ఉత్తమ పర్యాటక కేంద్రంగా ఎంపికైంది. శుక్రవారం విజయవాడలో పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేయనున్నారు. హార్సిలీహిల్స్ ఉత్తమ పర్యాటక ఫిలిం షూటింగ్ ప్రదేశంగా ఎంపికై ంది. విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం అవార్డును అందుకోనున్నారు.

నేడు గండికోటకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గండికోటకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కడప నుంచి ఉదయం 9, మధ్యాహ్నం 12.00 గంటలకు స్పెషల్ సర్వీసులను నడుపుతున్నామని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 7.30 గంటలకు ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. అలాగే జమ్మలమడుగు నుంచి గండికోటకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గంటకో బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆమె వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు , వారి తల్లిదండ్రులు, పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేద విద్యార్థులకు కూటమి శాపం



నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే మెరుగైన విద్య అవసరం. ముఖ్యంగా సీబీఎస్ఈ (సెంట్రల్‌బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్ చదివిన విద్యార్థులే జాతీయ స్థాయిలో పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సర్కారు బడుల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను తీసుకొచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సర్కారు బడుల్లో సీబీఎస్ఈ అమలును రద్దు చేసింది. దీంతో సీబీఎస్ఈ చదువుతున్న తొమ్మిది, పది తరగతుల విద్యార్థుల భవిష్యతుత ప్రశ్నార్థకంగా మారింది.

- ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానం నిలిపివేత
- నష్టపోయిన పేద, మధ్య తరగతి పిల్లలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు



సీబీఎస్ఈ అమలవుతున్న తంబళ్లపల్లెలోని మోడల్ స్కూల్



మదనపల్లె సిటీ: గత ఐదు సంవత్సరాల్లో విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. విజ్ఞాన కాంతులు వెదజల్లాయి. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలని నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే వారికి బోధించే సీబీఎస్ఈ సిలబస్‌ను సర్కారు బడుల విద్యార్థులకు చేరువ చేశారు. 2021–2022 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది.

మళ్లీ మొదటికి ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలల్లో అనాలోచిత నిర్ణయాలు అమలు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేసింది. తద్వారా పేద విద్యార్థులను నాణ్యమైన విద్యను దూరం చేసింది. తమ పిల్లలకు అత్యుత్తమ విద్య అందకుండా అడ్డుకుంటూ వివక్ష చూపుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తు చీకటిమయం: సీబీఎస్ఈ రద్దు వల్ల జిల్లాలోని విద్యార్థుల భవిష్యత్తు చీకటిమయమైంది. గత ఐదు సంవత్సరాల్లో పేద విద్యార్థుల తలరాత మార్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేసింది. వాటిని ప్రస్తుతం కూటమి సర్కార్ ఒక్కొక్కటిగా రద్దు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రైవేటు బాట పట్టించేందుకు కుట్రలు చేస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

సీబీఎస్ఈతో విద్యార్థుల్లో నైపుణ్యం



ప్రభుత్వ పాఠశాలలోల సీబీఎస్ఈ విధానం అమలుతో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందాయి. ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలోఓ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు పిల్లలు సన్నద్ధం కావాలంటే సీబీఎస్ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. సీబీఎస్ఈ అమలయ్యే పాఠశాలల పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వెళ్తుంది. సీబీఎస్ఈ విధానాన్ని ప్రభుత్వం కొనసాగించాలి.

–జీవీ ప్రసాద్, వైఎస్సార్‌టీఎఫ్ వ్యవస్థాపక సభ్యులు, మదనపల్లె

పేదలకు వ్యతిరేకులుగా మారతారు



సర్కారు బడుల్లో అమలవుతున్న సీబీఎస్ఈ విననాన్ని రద్దు చేయడం వల్ల కూటమి ప్రభుత్వం పేదల వ్యతిరేకులుగా మారుతారు. సీబీఎస్ఈ రద్దుతో ప్రభుత్వానికి ఒరిగేది ఏమో అర్థం కావడం లేదు. పేద విద్యార్థులు బాగుపడడం సర్కారుకు ఇష్టం లేదా? ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల పట్ల వివక్ష ఎందుకు చూపుతున్నారో తెలపాలి. సీబీఎస్ఈ విధానాన్ని కొనసాగించాలి.

–మాధవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు

సీబీఎస్ఈ వల్ల కలిగిన ప్రయోజనాలు ఇవే.....



విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

- జిల్లాలోని 47 పాఠశాలల్లో సీబీఎస్ఈ చదివిన విద్యార్థులు దేశంలో ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపు పొందేలా శిక్షణ పొందారు.
- ప్రముఖ విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, ఎయిమ్స్, జిప్‌మర్, సీఎంసీ వంటి సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ, నీట్ వంటివి సీబీఎస్ఈ సిలబస్‌లో తర్ఫీదు పొందారు.
- ఒత్తిడికి లోనవకుండా తన ఆసక్తికి అనుగుణంగా విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు.
- సీబీఎస్ఈ వల్ల ఏ రాష్ట్రానికి వెళ్లినా చదువుకు ఇబ్బంది లేకుండా కొనసాగించవచ్చనే ఆత్మస్థైర్యాన్ని పొందారు.
- నైపుణ్యాలను పెంపొందించుకుని ఈ విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ విధానంలో పది పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు.
- సీబీఎస్ఈ వల్ల విద్యార్థులు తమంతట తామే చదువుకోగలిగే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు.
- సమస్యలను తనంతట తాను పరిష్కరించుకునే సామర్థ్యం విద్యార్థుల్లో పెంపొందిందని టీచర్లు చెబుతున్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారి

వీరబల్లి: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా బాలల రక్షణ అధికారి వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఓదివీడు పంచాయతీలోని ఎర్రంరాజుగారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణపై గుడ్ నైబర్స్ ఏపీకోర్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ హక్కుల పరిరక్షణ గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.అనంతరం బాలల హక్కులు, చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా ఎస్ఐ రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ నాగేశ్వర్, ఐసీపీయూ సిబ్బంది రవి, అడ్వకేట్ కొరుసీ, రమాదేవీ, బాబు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కోర్సులో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ యువతులకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో హైదరాబాదులోని ప్రథమ్ హెల్త్ కేర్ శిక్షణ కేంద్రంలో రెండు నెలలపాటు నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ సరితాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–30 ఏళ్లలోపు యువతులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, డిప్లొమా లేదా ఏదైనా ఒకేషనల్ కోర్సు చేసి ఉండాలన్నారు. అభ్యర్థినిలు పదవ తరగతి మార్కులిస్టు, ఆధార్, మూడు పాస్‌పోర్టు ఫొటోలతో అక్టోబరు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, సౌకర్యం, స్టడీ మెటీరియల్, ఒక జత యూనిఫారాన్ని అందజేస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థినిలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9000203952 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

వారంలోగా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలి

- ప్రసవాల సంఖ్య పెంచాలి
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



ఆసుపత్రి దారి సమస్యపై ఆరా తీస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

తంబళ్లపల్లె: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో వారంలోగా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ కేసుల గురించి ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ కేసులు తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విధి నిర్వహణపై మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్యను అడిగి తెలుసుకున్నారు. సాధారణంగా ఆస్పత్రికి ఎలాంటి కేసులు వస్తాయి, ప్రీడియాట్రిక్ కేసులు ఎన్ని? ఎలాంటి మందులు అందుబాటులో ఉన్నాయి? కొరత ఏమైనా ఉందా? సెంట్రల్ డిస్పెన్సరీకి మందుల ఇండెంట్ ఎప్పుడు పెడతారు? రాత్రి వేళ ఎంత మంది వైద్యులు,సిబ్బంది విధుల్లో ఉంటారు..తదితర అంశాలపై ఆరా తీశారు. మందుల రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు రోజు అప్‌డేట్ చేయాలని మెడికల్ ఆఫీసర్, సిబ్బందిని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్,ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషంట్ల వార్డులు, బెడ్లు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సీహెచ్‌సీలో నెలకు 20–30 ప్రసవాలు జరుగుతుంటే ఇక్కడ 7 మాత్రమే జరగడం ఏమిటని ప్రశ్నించారు. ప్రసవాల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనంలో ఆపరేషన్ థియేటర్ పనుల గురించి మెడికల్ ఆఫీసర్ కలెక్టర్‌కు తెలపగా అది ఏర్పాటయ్యేలోపు వారం రోజుల్లో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు త్వరలో నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ వైద్యులు లేరని తమ దృష్టికి వచ్చిందని ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. ఇక్కడ పని చేసే డెంటల్ డాక్టర్ డిప్యుటేషన్‌పై వెళ్లారని దీనిని రద్దు చేసి ఇక్కడికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రికి గతంలో ఉన్న గేటు వద్ద దారి సమస్య ఉందని ఆస్పత్రి స్థలాన్ని కొందరు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నట్లు స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ హరిప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఎంఈఓ త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురంలోని శ్రీ పట్టాభిరామాలయంలో గురువారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపారు. అర్చన, అభిషేకం, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం అర్చకులు ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపానికి తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు. చివరగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ, అర్చకులు గోకుల్, భాషికాచార్యులు, అనిల్ కుమార్, రామ్ గోపాల్ పాల్గొన్నారు. –వాల్మీకిపురం

ప్రకృతి సోయగం.. పర్యాటక వైభవం

- 'అన్నమయ్య'లో తలమానికంగా పలు కేంద్రాలు
- ఒంటిమిట్ట, రాయచోటి, నందలూరు, లక్కిరెడ్డిపల్లె ఆలయాలకు విశేష గుర్తింపు
- ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తే... పుష్కలంగా ఆదాయ వనరులు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



ప్రకృతి రమణీయత మధ్య ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా పర్యాటకానికి పెట్టింది పేరు..ఆహ్లాదానికి నిలయం ..అందాల సోయగం.. చెయ్యేరు, మాండవ్య, బాహుదా నదుల నడుమ చందనం వృక్షాలతో ప్రత్యేక పచ్చని కళ. నల్లమల, శేషాచలం కొండలతో పరవశించిన ప్రకృతి మధ్య జీవనం అద్భుతం. పర్యాటక క్షేత్రాలకు కొదవలేని ప్రాంతం అన్నమయ్య జిల్లా. ప్రత్యేక విడిదిగా గుర్తింపు పొందిన హార్సిలీహిల్స్...అద్భుతమైన కోటలు, పురాతన ప్రాశస్త్యంగల ఆలయాలతో జిల్లా అలరారుతోంది. పర్యాటకరంగ పరంగా అభివృద్ధి చేస్తే ఎనలేని ఆదాయ వనరులుగా మారుతాయనడంలో సందేహం లేదు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పర్యాటక క్షేత్రాల గురించి తెలుసుకుందాం.

రాములోరి కోవెల ఏకశిలా నగరం

రాష్ట్ర విభజన అనంతరం భద్రాచలం తెలంగాణ రాష్ట్రంలోకి వెళ్లడంతో..ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి ప్రభుత్వ గుర్తింపు లభించింది. అప్పటి నుంచి ఏటా శ్రీరామ నవమికి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం...ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించడం, పండు వెన్నెల్లో శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. రాష్ట్రంలోనే ఏకశిలానగరికి ప్రత్యేక గుర్తింపు రావడంతో టీటీడీ ఆధ్వర్యంలో సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారు. పర్యాటకంగా తిరుమలకు వెళ్లే వారు ఒంటిమిట్టలో స్వామి వారిని దర్శించుకుని వెళుతుంటారు.

అన్నమయ్యలో అనేక క్షేత్రాలు

జిల్లాలో అనేక ఆలయాలు, క్షేత్రాలు ప్రసిద్ధి చెందాయి. ప్రధానంగా రాయచోటి వీరభద్రస్వామి ఆలయానికి సంబంధించి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి ప్రతినిత్యం పర్యాటకులు వస్తుంటారు. నందలూరులో సౌమ్యనాథస్వామి ఆలయం, రాజంపేట సమీపంలోని అత్తిరాలలో పరశురాముని ఆలయం, తాళ్లపాక వద్ద అన్నమయ్య క్షేత్రం, సిద్దవటం సమీపంలోని నిత్యపూజకోన, తంబళ్లపల్లె వద్ద మల్లెయ్య కొండ, రెడ్డెమ్మ కొండ, లక్కిరెడ్డిపల్లె వద్ద అనంతపురం గంగమ్మ తల్లి, రైల్వేకోడూరు వద్ద భుజంగేశ్వరస్వామి తదితర క్షేత్రాలతో పాటు ఇంకా అనేక ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

చారిత్రాత్మక కోటలకు నెలవు

జిల్లాలో చారిత్రాత్మక కోటలకు అన్నమయ్య జిల్లా నెలవుగా నిలుస్తోంది. ప్రధానంగా గుర్రకొండ కోటతోపాటు సిద్దవటం కోటలు ప్రసిద్ధి చెందాయి. అంతేకాకుండా నందలూరు సమీపంలోని అడపూరు బౌద్ధారామాలు, రాజంపేట సమీపంలోని పోలిగుట్టపై కూడా అప్పటి అవశేషాలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. రాయచోటి సమీపంలోని వెలిగల్లు, ఝరికోన ప్రాజెక్టుల సందర్శనకు కూడా నిత్యం ప్రజల రద్దీ కొనసాగుతోంది. జిల్లాలో పర్యాటక ప్రాంతాలతో నిత్యం విరాజిల్లుతోంది.

వేసవి విడిది హార్సిలీహిల్స్

జిల్లాలోని పేరెన్నికగన్న పర్యాటక ప్రాంతాల్లో ముందుగా హార్సిలీహిల్స్‌ను చెప్పుకోవచ్చు. ఎన్నో షూటింగ్‌లు, ఎంతోమంది నటులు అక్కడ విడిది చేయడంతో హార్సిలీహిల్స్ బాగా గుర్తింపు పొందింది. ప్రధానంగా వేసవి విడిదికి ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ బస చేస్తుంటారు. ఎత్తయిన ప్రదేశంలో ఉండడంతో వేసవి కాలంలోనూ చల్లని గాలులతో మనసు పులకించేలా అక్కడి వాతావరణం ఉండడం విశేషం. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఒబెరాయ్ సంస్థకు చెందిన స్టార్ హోటల్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.

29న చదరంగం పోటీలు

కడప స్పోర్ట్స్: కడప నగరం అలంఖాన్‌పల్లెలోని విస్డం పాఠశాలలో ఈనెల 29వ తేదీ ఆదివారం రాష్ట్రస్థాయి చదరంగం ఓపన్ ప్రైజ్‌మనీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు. రూ.30వేలు నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్‌ను విజేతలకు బహుమతులుగా అందజేయనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌కు ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరావు, సుమన్, ఫిడే ఆర్బిటర్‌లు గోపీనాథ్, వంశీ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8341255151 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాజకీయ చట్రంలో రాజంపేట కమిషనర్

- మున్సిపల్ కమిషనర్‌కు అన్న క్యాంటిన్ ప్రారంభ సెగ
- టీడీపీ వర్గీయుల విభేదాల నేపథ్యంలో పది రోజులకే బదిలీ
- నూతన కమిషర్ నియామకంలో పురపాలక మంత్రి జోక్యం
- బాధ్యతలు స్వీకరించిన కొత్త కమిషనర్ బిల్లా నాగేశ్వరరావు


రాజంపేట పురపాలకసంఘం

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో అన్న క్యాంటిన్ ప్రారంభ రిబ్బన్ కటింగ్ వివాదం కొత్త కమిషనర్ నియామకానికి దారి తీసింది. అధికార పార్టీలో అన్న క్యాంటిన్ ప్రారంభోత్సవం సందర్భంగా తమ్ముళ్ల మధ్య ఉన్న విభేదాలు రోడ్డున పడ్డాయి. అన్న క్యాంటిన్ ప్రారంభ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించలేక పోయిన కమిషనర్ కిషోర్ (ఎఫ్ఏసీ)ను ఆ పదవి నుంచి తప్పించడానికి కారణమైంది. ప్రధానంగా టీడీపీలో సుగవాసి బాలసుబ్రమణ్యం, పార్లమెంటరీ పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుల మధ్య వర్గవిభేదాలు కొనసాగుతున్న విషయం విదితమే.

పట్టుమని పది రోజులే..

కిషోర్ కడప కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. అయితే ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ నల్లా రాంబాబు అనారోగ్య కారణాల వల్ల విధులకు రాలేకపోయారు. అయినప్పటికీ కమిషనర్‌గా విధులు అడపా దడపా చేపడుతూ వచ్చారు. ఇక వీలులేని పరిస్థితిలో వేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో మెడికల్ లీవ్‌లో వెళ్లిపోయారు. దీంతో టీడీపీలోని ఓ వర్గనేత ఆశీస్సులతో అదే సామాజికవర్గానికి చెందిన కిషోర్‌ను కమిషనర్‌గా నియమించారు. పట్టుమని పదిరోజులు కాకముందే అన్నక్యాంటిన్ ప్రారంభం సెగ ఆయనను ఇక్కడి నుంచి సాగనంపేలా చేసింది.

అనుకూల కమిషనర్ కోసం..

మరోవర్గం నేత గతంలో ఇక్కడ పనిచేసిన తన సామాజిక వర్గానికి చెందిన అధికారిని ఇక్కడికి తీసుకురావాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అనుకూలమైన కమిషనర్ కోసం టీడీపీలోని రెండు వర్గాలకు చెందిన నేతలు పావులు కదిపారు. కాని పురపాలక మంత్రి వారికి చాన్స్ ఇవ్వలేదన్న వాదన వినిపిస్తోంది.

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ బిల్లా



సీడీఎంఏ నుంచి ఉత్తర్వులు వెలువడటంతో గురువారం రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా బిల్లా నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ వాసుల సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ సహకారంతో కృషి చేస్తానన్నారు.

రంగంలోకి దిగిన పురపాలకమంత్రి

రాజంపేట మున్సిపల్ కమిషనర్ నియామకం వ్యవహారంలో ఇద్దరు వర్గనేతలు పోటీ పడటంతో నేరుగా పురపాలక మంత్రి నారాయణ రంగంలోకి దిగినట్లు సమాచారం. పైగా అన్న క్యాంటిన్ ప్రారంభం సందర్భంగా టీడీపీ వర్గీయుల ఘర్షణ ఆ పార్టీని అభాసుపాలు చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. మున్సిపాలిటీని గాడిలో పెట్టేందుకు మంత్రి జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బిల్లా నాగేశ్వరరావును రాజంపేట కమిషనర్‌గా నియమించారు.

క్లుప్తంగా

నాటు సారా స్వాధీనం

వాల్మీకిపురం : మండలంలో గురువారం నాటుసారా అక్రమ రవాణాపై విస్తృత దాడులు నిర్వహించారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొత్తవాండ్లపల్లికి చెందిన చెన్నం మధు (37), మంజునాథ్ (24)లు కలసి అక్రమంగా నాటు సారా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ శ్రీహరి సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు

కలకడ : ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గురువారం మండలంలోని కోన పంచాయతీ గంగిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటరమణ, శివ, రామచంద్ర, రమాదేవి, మల్లికార్జున, రమణ భూమి విషయమై గొడవపడ్డారు. రమాదేవి ఫిర్యాదు మేరకు వెంకటరమణ, శివపైన అలాగే, వెంకటరమణ ఫిర్యాదు మేరకు రామచంద్ర, రమాదేవి, మల్లికార్జున, రమణపై కేసు నమోదు చేశామన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం మండల పరిధిలోని ముష్టూరు పంచాయతీ ఎరప్పగారిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన పోతురాజు రెడ్డిరాజు అనే వ్యక్తి గ్రామ సమీపంలో సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

బకాయిలు చెల్లించాలని అద్దె వాహన యజమానుల నిరసన


నిరసన తెలుపుతున్న వాహన యజమానులు

రాయచోటి టౌన్ : గత ఎన్నికల సమయంలో ఎన్నికల అధికారుల కోసం ఏర్పాటు చేసిన వాహనాలకు అద్దె బిల్లులు వెంటనే చెల్లించాలని వాహనాల యజమానులు జిల్లా వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల నిర్వహణ కోసం వాహనాలు అద్దెకు తీసుకొన్నారని చెప్పారు. అందులో సగం వరకు అద్దె బకాయిలు చెల్లించారన్నారు. ఆ తరువాత ఇప్పటి వరకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓ తదితర అధికారులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై స్పందించిన జిల్లా రవాణాశాఖ అధికారి భరత్ చౌహాన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.96 లక్షలు బకాయి ఉందన్నారు. ఈ మొత్తాన్ని త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

44వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఫ్రీహోల్డ్ జరిగిన 44వేల ఎకరాల భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. గురువారం సబ్ కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... డివిజన్‌లోని 11 మండలాల్లో 44వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే, 21,500 ఎకరాలు సక్రమమేనని తేలాయన్నారు. మిగిలిన 22,500 ఎకరాలు ఫ్రీహోల్డ్‌లో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించడం, డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవడం, అసైన్‌మెంట్ చేసినట్లు ఆధారాలు సమర్పించకపోవడం, 2003 తర్వాత భూములను చేసినట్లుగా గుర్తించామన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో పెద్దమండ్యం మండలంలో అత్యధికంగా 9,200 ఎకరాలు, మదనపల్లెలో 3,600 ఎకరాలు, రామసముద్రంలో అత్యల్పంగా 759 ఎకరాలు ఫ్రీహోల్డ్ జరిగాయన్నారు. సబ్ కలెక్టరేట్‌లో రెవెన్యూ వివాదాలకు సంబంధించి ప్రతి శనివారం నిర్వహించే ఆర్ఓఆర్ కోర్టును త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి కేసుపై ఆర్డీ విచారణ

మదనపల్లె : మున్సిపాలిటీ రిటైర్డ్ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం తనకు రావాల్సిన ప్రయోజనాలపై హైకోర్టులో కేసు వేసిన నేపథ్యంలో మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్ విచారణ చేశారు. గురువారం మదనపల్లె మున్సిపాలిటీలో విచారణ నిమిత్తం వచ్చిన ఆయన ప్రస్తుత కమిషనర్ కె.ప్రమీల, గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసి, ప్రస్తుతం ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న రఘునాథరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ...టౌన్‌ప్లానింగ్ విభాగంలో చైన్‌మెన్‌గా పనిచేసి రిటైర్ అయిన ప్రభాకర్ 1986లో రామారావుకాలనీలో మేస్త్రీగా ఎన్ఎంఆర్ హోదాలో విధుల్లోకి చేరారన్నారు. 2011లో టౌన్ ప్లానింగ్ విభాగంలో చైన్‌మెన్‌గా ర్యెగులర్ ఉద్యోగి అయ్యారన్నారు. 2014లో ఉద్యోగ బాధ్యతల నుంచి పదవీ విరమణ పొందారన్నారు. అయితే గతంలో ఎన్ఎంఆర్ నుంచి చైన్‌మెన్‌గా ర్యెగులర్ అయినప్పుడు తనకు వర్తించాల్సిన ప్రయోజనాలు, పెన్షన్ విషయమై ప్రభాకర్ హైకోర్టుకు వెళ్లారన్నారు. కోర్టులో ప్రభాకర్‌కు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ, దాన్ని అమలు చేయడంలో, పై కోర్టుకు అప్పీలుకు వెళ్లడంలో అధికారులు ఉదాసీనత కనబరిచారన్నారు. దీంతో బాధితుడు తనకు న్యాయం చేయాల్సిందిగా తిరిగి కోర్టును ఆశ్రయించడంతో, సమస్య పరిష్కారంలో భాగంగా విచారణకు వచ్చినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పీలేరు రూరల్ : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన గురువారం పీలేరు మండలంలో జరిగింది. ఎస్ఐలు బాలకృష్ణ, లోకేష్‌ల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవవడ్డిపల్లె చెరువులో మహిళ మృతదేహం తేలియాడుతున్నట్లు స్థానికులు సమాచారం అందించారు. పీలేరు అగ్నిమాపక సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పారిశుద్ధ్య కార్మికుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో పరిసర ప్రాంతాల్లో ఆరా తీశారు. మృతురాలిని స్థానికంగా ఇటుకల బట్టీలో పని చేసే తమిళనాడుకు చెందిన మణి భార్య సాయిసుధ (25)గా గుర్తించారు. గత మంగళవారం భార్య, భర్త గొడవపడ్డారు. అప్పటినుంచి సాయిసుధ కన్పించలేదని ఆమె భర్త మణి తెలిపారు. మృతురాలికి స్నేహ, కృష్ణదేవ అనే పిలలు ఉన్నారు. సాయిసుధ నడుముకు రాయి కట్టుకుని నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుందా, లేక ఎవరైనా హత్య చేసి రాయి కట్టి చెరువులో పడేశారా? అన్న కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి : జిల్లాలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, నీటిపారుదల, జీఎస్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల జిల్లా అధికారులు, హౌసింగ్ ఏఈలతో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈనెల 28న జరగబోయే మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంలో జిల్లాలోని పెద్ద లే అవుట్‌లకు కేటాయించిన ప్రత్యేక అధికారులు, హౌసింగ్ శాఖ అధికారులు లబ్ధిదారులందరికీ అవగాహన కల్పించి ఇల్లు కట్టుకునేలా ప్రోత్సహించాలన్నారు. రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి, హౌసింగ్ శాఖ పీడీ శివయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితునికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

పెద్దమండ్యం : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న బాధితునికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి రూ. 1 లక్ష ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని ఎన్‌వోపల్లె పంచాయతీ కలిచెర్ల పాతూరుకు చెందిన ఎస్. షబ్బీర్ అహ్మద్ కుమార్తె సుమియా (16) వాల్మీకిపురం మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కళాశాలలో సుమియాను వదిలేందుకు అన్న మన్సూర్ (20) ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. పెద్దమండ్యం– గుర్రంకొండ రహదారిపై సోమవారం సాయంత్రం సచివాలయం వద్ద మలుపులో ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న బొలేరో పికప్ వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో మన్సూర్‌కు తీవ్ర గాయాలు కాగా, చెల్లెలు సుమియాకు స్వల్ప గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుని పరిస్థితిని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ. 1లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆర్థిక సహాయం సొమ్మును బాధితుని తండ్రికి మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, మాజీ ఎంపీపీ పి. ప్రసాద్ రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ రషీదా, సర్పంచ్ జింకా విశ్వనాథ, ఆర్‌బీకే చైర్మన్ చాను, వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ ఖాదర్‌బేగ్ అందజేశారు.

కలియుగ దైవంతో రాజకీయం చేస్తే పుట్టగతులుండవు

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : విజయవాడ వరద బాధితులకు సహాయం, ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అందించక పోవడం వంటి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డు వివాదం తెర మీదకు తెచ్చారని.. దేవదేవుడితో కూడా రాజకీయాలు చేస్తే పుట్టగతులుండవని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చేతిలో అధికారం పెట్టుకొని విచారణ చేయకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ ఆరోపణలపై సీబీఐ, సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో 100 రోజుల పాలనలో తమ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని సంక్షేమ పథకాలు అందించారో ప్రజలకు తెలుసన్నారు. ప్రస్తుతం చంద్రబాబు కొత్త పథకాలు ఇవ్వక పోగా.. పేదలకు వస్తున్న సంక్షేమ పథకాలు ఆపేసి ప్రజలకు మోసం చేశాడని ధ్వజమెత్తారు.

చిచ్చు పెట్టేందుకే పవన్ దీక్ష డ్రామాలు

ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ దీక్షల పేరుతో డ్రామాలు ఆడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల విమర్శించారు. కుల మతాలకు అతీతంగా పని చేయాల్సింది పోయి, రెచ్చగొట్టి వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మాజీ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన హమాలీల నిరసన

రాజంపేట రూరల్ : పౌర సరఫరాల శాఖ గోడౌన్‌లలో పని చేసే హమాలీల కూలి రేట్లను పెంచాలని చేపట్టిన నిరసన కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు , పట్టణ కార్యదర్శి ఈ. సికిందర్, నాయకులు నాగేశ్వరరావు, సివిల్‌సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సూర్య, రాఘవేంద్ర, ప్రసాద్, కోదండరాముడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : పౌరసరఫరాల శాఖ స్టాక్‌పాయింట్లలో పనిచేసే కూలీలకు వెంటనే జీతాలను పెంచాలని హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి క్రిష్ణయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో గల సివిల్ సప్లయ్స్ గోడౌన్ వద్ద తమ సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు సంపత్‌కుమార్, ఆంజనేయులు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి భూములు అమ్మేసిన టీడీపీ నాయకుడు

మదనపల్లె : అభయాంజనేయస్వామి ఆలయ బాగోగులు చూసే నెపంతో, దేవుడి భూములను టీడీపీ నాయకుడు అమ్మి సొమ్ములు చేసుకున్నాడని ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు అందింది. గురువారం మదనపల్లె మండలంలోని సీటీఎం క్రాస్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు, స్థానికుడైన ఎం.గురుప్రసాద్, టీడీపీ నాయకుడు రెడ్డి రాంప్రసాద్ అలియాస్ రెడ్డిస్వామి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. రెడ్డిస్వామి అమ్ముకున్న భూముల విలువ రూ.2కోట్లకు పైగానే ఉంటుందన్నారు. అయితే కార్యక్రమంలో ప్రజలందరి నుంచి అర్జీలను స్వీకరించినట్లుగానే, దీన్ని తీసుకుని, పరిష్కరిస్తామని దండంపెట్టి ఎమ్మెల్యే వెళ్లిపోయారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు : ఎస్పీ

మదనపల్లె : జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. గురువారం ఆయన మదనపల్లె పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పోలీస్ క్వార్టర్స్ భవనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి వినియోగం, విక్రయం రవాణా, తదితర అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఇప్పటికే ట్రాఫిక్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కేటాయించామన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు పై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పోలీస్ క్వార్టర్స్‌ను వినియోగంలోకి తెచ్చి హోంగార్డులకు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కొండయ్య నాయుడు, సీఐలు చాంద్ బాషా, రామచంద్ర, కళా వెంకటరమణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజీని కొనసాగించాలి

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధిలో మదనపల్లెలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీని కొనసాగించాలని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయించడం దారుణమని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్(ఆర్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు జగన్ అన్నారు. గురువారం మదనపల్లె మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం పట్టణంలోని వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి మెడికల్ కాలేజీ పనులు నిలిపివేయడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా జరిగి దాదాపు 75శాతం పూర్తి అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలనే దురాలోచనతో రాజకీయ కుట్రలో భాగంగా ఉద్దేశపూర్వకంగానే పనులు నిలిపివేయించిందన్నారు. రాష్ట్రప్రభుత్వం వైద్యవిద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోకుండా, ముఖ్యంగా రాయలసీమకు మంజూరైన మెడికల్ కాలేజీలను నిలుపుదల చేయించడం అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు.

హత్య కేసులో కుమారుడు, కోడలే ప్రధాన నిందితులు

ములకలచెరువు : ములకలచెరువులో ఆదివారం రాత్రి ఒక మహిళను గొంతకోసి హత్య చేసిన కేసులో కుమారుడు, కోడలు ప్రధాన నిందితులుగా దర్యాప్తులో వెల్లడైనట్లు సీఐ రాజారమేష్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. స్థానిక మండల కేంద్రం కదిరి రోడ్డులో ఉన్న అగ్రహారం షఫియా బేగం(55)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త అగ్రహారం హైదూ సాహెబ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె చిన్నకుమారుడు అగ్రహారం రెడ్డిబాషా వద్ద ఉంటోంది. ఆస్తుల పంపకంలో గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. రెడ్డిబాషా మాత్రం ఆస్తి మొత్తం తనకే కావాలని తల్లితో పలుమార్లు గొడవ పడినట్లు చెప్పారు. తల్లి మాట వినకపోవడంతో చంపేందుకు భార్య హర్షియాతో కలిసి పన్నాగం పన్నారు. గత ఆదివారం రాత్రి తల్లి షఫియా బేగం నిద్రిస్తుండగా కత్తితో గొంతుకోసి హత్య చేశారు. తర్వాత వాహనంలో వారే ఆసుపత్రికి తీసుకెళ్తుండగా తీసుకెళ్లే మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది. మృతురాలి కుమార్తె సోనియా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో కుమారుడే హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు.

బొప్పాయి రైతుకు గిట్టు బాటు ధర కల్పించాలి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులోని బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర 25 రూపాయలు కల్పించి, దళారుల వ్యవస్థ రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ కోరారు. గురువారం టోల్ గేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

వ్యక్తి అరెస్టు

రామసముద్రం : రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి పంచాయతీ ఎగువనల్లప్పగారిపల్లికి చెందిన వెంకటరమణ కర్ణాటక మద్యం అమ్ముతుండగా అరెస్టు చేశామని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దమండ్యం : మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ సాకలపల్లె వద్ద మామిడి తోపులో జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ పి.వెంకటరమణ తెలిపారు. దాడుల్లో ఐదుగురు పట్టుబడగా, వీరి నుంచి రూ. 7200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గర్భగుడికి తాళాలు

సుండుపల్లె : మండలంలోని విరూపాక్ష చెన్నకేశవ స్వామి ఆలయంలో గర్భగుడికి తాళాలు వేయడంతో స్వామివారికి దీపారాధన కరువైంది. పది రోజుల క్రితం గుడిలో పూజారిగా పనిచేస్తున్న సుబ్రమణ్యం స్వామి రాజీనామా చేశారు. అప్పటి నుంచి గుడితాళాలు తెరుచుకోవడం లేదు.

పూలవాండ్లపల్లెలో చోరీ

మదనపల్లె : మదనపల్లి మండలం కొత్తవారిపల్లె పంచాయతీ పూలవాండ్లపల్లె లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. స్థానికుడైన రెడ్డి మోహన్ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం చికిత్స కోసం మదనపల్లెకు వెళ్లాడు. రాత్రి ఆసుపత్రిలోనే గడిపి చికిత్స పొందాడు. గురువారం తిరిగి ఇంటికి వెళ్లగా గుమ్మం తలుపుల తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. రూ. 80 విలువచేసే 16 గ్రాముల బంగారు, రూ. 17వేల నగదు చోరీ చేసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో చేను కృష్ణయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు కృష్ణయ్య మంగంపేట అగ్రహారం నుంచి ద్విచక్ర వాహనంపై మంగంపేటకు వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో కృష్ణయ్యకు కాలు విరిగింది. వెంటనే 108 వాహనంలో రైల్వేకోడూరుకు తరలించారు.

బైకును కారు ఢీకొని..

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. కురబలకోట మండలం ఎర్రబల్లికి చెందిన కె.శ్రీనివాసులు (50) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోటకు వెళ్లాడు. తిరిగి కురబలకోటకు వస్తుండగా మార్గమధ్యంలోని గట్టు సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నాడు. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి కాలు విరిగింది. మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తిరుపతికి రెఫర్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ ఎల్లంగారిపల్లెకు చెందిన వై.రామిరెడ్డి (60) జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

చెక్ బౌన్స్ కేసులో జైలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం చిట్వేలి రోడ్డులో నివాసముంటున్న ఒలికుంట కిషోర్‌కు 2019వ సంవత్సరంలో ఎస్.గంగాధర్ అనే వ్యక్తి రూ.5లక్షలకు చెక్ ఇచ్చి డబ్బులు ఇవ్వకుండా ఉండడంతో బాధితుడు రైల్వేకోడూరు కోర్టును ఆశ్రయించాడు. ఇరు పక్షాల వాదనలు విన్న తరువాత గురువారం కోడూరు సివిల్ కోర్టు జడ్జి పీజే తేజా సాయి నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, రూ.5 లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం

ఓబులవారిపల్లె : కొర్లకుంట గ్రామ సమీపంలోని కృష్ణపట్నం రైల్వే బ్రిడ్జి సమీపంలో గురువారం గుర్తు తెలియని మృతదేహాన్ని(50) పోలీసులు గుర్తించారు. ఎస్ఐ పి.మహేష్ విలేకరులతో మాట్లాడుతూ స్థానికుల సమాచారం మేరకు రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించామన్నారు. సుమారు వారం రోజుల క్రితం మృతి చెందడంతో మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందన్నారు. ఆత్మహత్యనా లేక హత్యనా అన్న కోణంలో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

మదనపల్లె : భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు తాలూకా సీఐ కళ వెంకటరమణ తెలిపారు. మదనపల్లె సమీపంలోని చంద్ర కాలనీ గురుకుల పాఠశాల వద్ద నివసిస్తున్న మధుకర్ రెడ్డికి (40) కోళ్లబైలు పంచాయతీ మామిడి గుంపుల పల్లెకు చెందిన నందినితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం లేరు. 15 రోజుల క్రితం కుటుంబ సమస్యలతో భార్యాభర్తలు గొడవపడి, నందిని తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 16న మధుకర్ రెడ్డి మామిడి గుంపులపల్లెకు వెళ్లి, అత్తమామలను తన భార్య నందినిని కాపురానికి పంపించాల్సిందిగా కోరాడు. అయినా ఆమె కాపురానికి రావడానికి నిరాకరించడంతో మనస్తాపం చెంది అక్కడే పురుగుమందు తాగాడు. తిరుపతిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.